

# ఎదురింటి ఏడుకొండలు

రచన: "కరుణ"

వహాంచి డైలమాలో పడేసిందండీ! మా మఱదలు!—అయినా ఈ అమ్మాయిలో భగవంతు డింతటి కుశాగ్ర బుద్ధి నెలా ప్రసాదించేరో! కాకపోతే నే నరగంట పైగా బుర్రపగిలేలా ఆలోచించి కనిపెట్టిన మిస్టరీ నంతటిని చిన్న చిరునవ్వుతో 'సస్పెన్సు'లో పడేసింది మాపాప!

భోజనందగ్గర కూర్చున్నానే గాని ఏం సయిస్తుందండి నాముఖం! విస్తట్లో అన్ని గారెలు వేసారా! నాకు గారెలంటె పంచ ప్రాణాలూనా! అవంటె పడిచస్తానా! కానీ ఏదీ-మాటవరసకి వొక్కముక్క కొరకలేదండి! అఖరికి మా అవిడ నా వేపు కోపంగాచూస్తూ "ఏమయ్యా! అలా చూస్తూ విస్తరిముందు కూర్చుంటావేం? నీ కక్కర్లేకపోతే నా విస్తట్లో పడేయ్యవయ్యా!" అంది. ఏంచేస్తాం-స్వహస్తాల్తో అరవప్రాణమైన గార్లెని దానివిస్తట్లో పడేసాను! అంతేనండి! దేనికైనా 'దంతసిరి' వుండొద్దూ! ఆఁ! 'దంతసిరి' అంటే జ్ఞాపకంవచ్చింది! అబ్బబ్బ! ఏమిటండీ! ఆతృత? చెప్తాగా! మరి నన్నలా తొందరపెట్టకండి!

ఒకసారి నేను అఫీసునుండీవస్తున్నానేను పేరుపొందిన ప్రావిన్షల్ గవర్నమెంటు ఆఫీసులో సుప్రసిద్ధమైన' ఎన్. జి. ఓ. ని'-నాకీ వుద్యోగమే వొక 'గవర్నరు జనరల్' పదవిలాటి పదవి! అటువంటిది నా వుద్యోగాన్ని మా అవిడ "కూసుముండా వుద్యోగం" అంటుంది! ఏంచేస్తాను! చచ్చినట్టు వొప్పుకున్నాను! అదిగో! నాకుతెలుసు! దెబ్బలాట కొస్తున్నారుకదూ! భార్యాలోలుడు! అడదానికెదుసుచెప్పలేని చవట! అంటున్నారు కదూ! కాదండీ! నాకు కొంచెంగా పెళ్లాంమీద ప్రేమ అధికమే! ఒప్పుకున్నాను! అసలు ఆ మాత్రం ప్రేమ చేసుకొన్న భార్యమీద చూపించనివాడు మగవాడేమిటండి! యింటికొచ్చేసరి కందంగా లడ్డూలా కన్పిస్తూ, రాత్రి పగలు వండిపెడ్తూ మనమంటే మక్కువతో పడి చచ్చే అడదానిమీద ఆమాత్రం ప్రేమ చూపించొద్దండీ! చికాకొస్తే కొంత కోపగించుకుంటే మాత్రం!

ఆమాత్రం మనం చేయలేదేమిటండి! ఇక ఆవిడ మాట వినడం తప్పా? "కార్యేషు దాసి కరణేషు మంత్రి..." అన్నారు. అటువంటిది అవిడమాట వినడం తప్పేమిటండి! అయినా కూడా నాకు ప్రావిన్షల్ గవర్నమెంటుమీదా, పనికిరాని 'ఎన్. జి. ఓ' పదవిమీదా వున్న వ్యామోహంకొద్దీ, చేస్తున్నది 'ఎన్. జి ఓ. వుద్యోగమే కనక వాదించేనండీ! "ఇదిగో! నన్ను తిట్టు - నన్ను కొట్టు! పడ్తాను! కాని నా వుద్యోగాన్నిమాత్రం తిడితే సహించను. నాది కూసుముండ వుద్యోగమా?" అన్నాను.

అబ్బో! మాఅవిడేం తక్కువదికాదండోయ్. పమిటకొంగు నడుంకు బిగించి నా సరసనచేరి "కాక ఏమిటయ్యా! మా కాఁవమ్మమామ్మ తెలుసా!" అంది. తెలుసునని బుర్రాడించేనండి! "అవిడేంచేస్తుందోతెలుసా?" అంది. "తెలుసు పొద్దున్నా-రాత్రి కలక్టరుగారింట్లో వంట చేస్తోంది" అన్నానండి!

"అవిడకి జీతం ఎంతో తెలుసా! తొంభయి రూపాయిలు-మరి నీజీతం కన్న పదెక్కువే! అవిడకు మొగుడు లేడయ్యా! ఏదో సంపాదించుకొంటోందయ్యా! అవిడ వుద్యోగమే నయం! పొద్దున్న వొహగంట-రాత్రి వొహగంట! కానీ నీవుద్యోగం? రాత్రిపగలు గొడ్డులా చాకిరీచేస్తున్నావు. కడిగినట్టిస్తున్నారు నలభయి రూపాయిలు! ఎందుకయ్యా! చూస్తున్నాను ఆర్నెల్లునుండీ! వొక్కరోజు రాత్రి వెన్నెల్లోసరదాగా నాతో కబుర్లుచెప్పే తీరిక నీకుందీ!"

ఏంచెప్తానండి జవాబు! మీరుమాత్రం ఏం జవాబుచెప్తారు? అంతేనండి! నిలేసి అడుగుతే మన్లో ఎందరు పున్నమ రాత్రులు భార్యపక్కనున్నారో తేలిపోతుంది! అందుకే వూరుకొన్నానండి! నిజానికి మనకే అనిపిస్తుంది. కాకపోతే భర్త గతించిన అకావమ్మ మామ్మపాటి చెయ్యలేదుమనం! పోన్లెండి! నేనేం చెప్తున్నానో?

ఆఁ! గుర్తుకొచ్చింది! "దంతసిరి" గురించికదూ! అలా అఫీసునుండి వస్తూంటే మార్కెట్లో ఎర్రని కాకరపళ్లు కన్పించేయి. నాకు గారెలతర్వాత ఆ కాకరపళ్లండి! వెంటనే ఫాంటుజేబు తడుముకున్నాను! ముచ్చటగా మూడు

కాన్లు తగిలేయి! పాతిక ముప్పావలాకి కాని యివ్వంది నాదగ్గరున్న మూడు కా న్లేమూలా! నాకు ప్రాణసమ మయిన ఆ కాకరకాయలు కొనుక్కోటానికి నా దగ్గర డబ్బులు లేవాయె! నాన్సెన్స్! లేకపోడమేమిటి! వున్నాయ్! కాని వున్న డబ్బులికి యివ్వరు? అడిగితే నవ్వు తారు! ఏంచేస్తాం! పోదామనుకొని అడుగు కదల్చబోయేను! కాని రెండు కాళ్లూ భూమిలో దిగబడిపోయి కదల నని భీష్మించుకొన్నాయి! అడుగు పడ టానికి కాలు కదిలితేగా! అసలు కళ్ళు సరేసరి! ఆ కాకరపళ్లవేపే! ఎలా గో తెగించి వెళ్లి అడిగేను! "వందెలా" అని. "రెండున్నర—" అయ్యో బాబోయ్! వంద రెండున్నర! నాదగ్గరున్నవి మూడుకాన్లు! ఎలాగండి! దిగజారి పోయేననుకున్నారా! అసలు నిజానికి నాలో చాల సమయస్ఫూర్తి అండి! ఈ మాత్రానికే భయపడ్డం ధీరుల లక్షణం కాదు. ఇటువంటప్పుడే చాణక్యుని రాజకుశలత ప్రకటించాలి! లేకపోతే అర్థశాస్త్ర మెలారాసేడు? తిమ్మరుసు ప్రజ్ఞ, యుగంధర చాకచక్యం చూపిం చాలండి! అంతేకాని భీరువునై వెను తిరిగిపోటమా! ఆలోచించేను. హమ్మ య్య! చక్కని ఆలోచన వచ్చిందండి! నెమ్మదిగా ప్రారంభించేనండి! "వంద లూ-రెండొందలూ నా కవసరంలేదే! నేనేం చేసుకొంటాను. నాకేం పెళ్లామా పిల్లలా! హోటల్లో భోజనం-మఠంలో నిద్ర-కా స్త మందులోకి ఓ మూడో, నాలుగో చాలు!" అన్నాను. అది నా వేపు వింతగాచూసి నవ్వుతూ "ఆకాకర పళ్ళు మందులోకేటిబాబూ!" అంది. ఇక చూసుకోండి మనప్రజ్ఞ! ఉన్నవీ లేనివీ అన్నీ మూటగట్టి" నీకు తెలీదూ? కాకరపళ్ళు చంటిపిల్లల అనాసజబ్బుకి అమృతం! అజీర్తికి అపరచింతామణి! అతి వాగుడికి పేరుమోసినమందు-యింకా" నేనింకా చెప్పబోతుండగా "యిందబాబూ" అంటూ పదిపళ్ళు తీసియిచ్చింది. నేను ఎంతయిద్దామా అని ఆలోచిస్తు-అసలు ఎంతడిగినా నా దగ్గర మూడుకాన్లేగా - ఎంతివ్వ మంటావ్!" అన్నాను. అది నవ్వుతూ "మందులో కట్టుకెళ్లేదానికి డబ్బు లెందుకుబాబూ! అయినా సలహాయిచ్చిన మారాజుదగ్గర డబ్బుచ్చుకొంటానా?"



అంది. నాకేం బోధపడలేదు. అందు కనే వింతగాచూసేను. "నా బిడ్డడు అనాసతో బాధపడ్తున్నాడు బాబూ!" అంది. అమాయికంగా నా మాటలు నమ్మింది. పాపం! అనిపించి గిర్రున నీరుతిరిగింది. నేను దాన్ని మోసంచేస్తు న్నందుకు సిగ్గనిపించింది - ఏంచేస్తా నండి! 'ఎన్. జి. ఓ'ని అయినా దాని ఋణం నాకెందుకని జేబులోని మూడు కాన్లూ యిచ్చేశాను. ఎంతైనా ఎన్. జి. ఓ. ని కదండి! దయార్ద్రహృదయులం మన 'ఎన్.జి.ఓ' లం! కాని ఏంచేస్తాం? మన కనీసపు అవసరాలకు మనదగ్గర డబ్బులుండవ్! కాదు వుంటాయ్ ఎలా? గోచీకి పెద్ద-గావంచాకి చిన్న—అవిస రాలు తీరవు. అప్పు యివ్వరు! అరే మన దుస్థితి! అం! సరే! మనగొడవ ఎలానూ వున్నదే! ఇక 'దంతసిరి' గూర్చి చెప్ప నివ్వండి! ఆ పది ఆ కాకరపళ్ళు అతి పదిలంగా యింటికి మోసుకొచ్చేను! అంత పదిలంగా తీసుకొచ్చి, మా అవిడ చేతిలోపోస్తూ" జాగ్రత్త! పులుసూ-బెల్లం వేసి వొండు" అన్నా! ఇక చూసుకోండి! ఆవిడ నాకేసి కొరకొరచూస్తూ "పులుసు బెల్లంకు!-ఛ! ఛ! చక్కగా వేయించు కొంటే కమ్మగా వుంటాయి. వేయించేస్తా లెండి" అంది. ఏంచేస్తాం! "సరె! ఏదో వొకటిచెయ్యి!" అనేసి బట్టలు మార్చు కొని అలా బీచికి బయల్దేరాన్ను.

రాత్రి భోజనాలదగ్గర చూద్దును కదా! ఆ కాకరముక్కలు నిల్! మా అవిడ నడుగుతే మ్యా ముద్దుల బావ మరిది వచ్చేడుట! ఆ కాసినిముక్కలు ఆయనగారు అరగించేరుట! క్షణం క్రిందట నేను మోసంచేసిన అమాయు కపుప్రాణి నాకళ్లముందు కన్పించింది–పాపం! నన్ను నమ్మి నాకు ఉచితంగా యిచ్చింది! కాని నాకు ప్రాప్తిలేదు. కాకపోతే యిప్పుడేరావాలీ మా బావ మరిది? అప్పుడంది మా అవిడ నవ్వుతూ చేతులూ, కళ్లూ అదోరకంగా తిప్పేస్తూ "దంతసిరి వుండొద్దూ!"అని. అది దంత సిరి అంటే! ఆc! ఇప్పుడు మనం దేన్ని గూర్చి చెప్పుకుంటున్నాం – అబ్బ! గుర్తొచ్చి చావటంలేదండి! "ఎదురింటి కొండలయ్యా!" ఛ! ఛ! కొండలయ్యా కాదండి! "ఎదురింటి ఏడుకొండలు"

సరే చెప్తున్నానుగా! భోజనా లయిం తర్వాత గదిలోకూర్చున్నా! ఎవరీ యేడు కొండలు! నా మఱదలుపిల్లకు ప్రేమ లేఖవ్రాసిన కిరాతకుడు! ఇంత అత్యద్భుతమైన సన్నెన్ను సృష్టించిన ధీరుడు! ఆలోచన్లు రైలుచక్రాల్లా పరిగెడ్తున్నాయి. కాని మధ్యమధ్య మా అవిడకేకలు-మాబావమఱుదుల గోలల ఈలలు–చిన్నచిన్న స్టేషన్లలా అడ్డొస్తు న్నాయి! కాని వాటి భేదించుకొంటూ సాగి పోతోంది నా ఆలోచన్ల రైలుబండి! ఇంతలో మాఆవిడ వచ్చిందండి! అబ్బ! కళ్ళు జిగేలుమన్నాయ్! ఎవరీ అందాల కుందనపు భరిణ! అతి లోకసుందరి! దివినుండి భువికిదిగిన దేవతా! అప్స రస! ఇది కలా? భ్రమా! నిజమా! కంచి పట్టుచీరతో! చిక్కటి తెల్లటి పట్టుజాకె ట్టుతో–తలంటుపోసుకొన్న వాలుజడతో-వాలుకన్నుల మేలుసిరుల క్రీగంటి చూపుల్తో! అబ్బ చాల అందంగావుంది! వస్తూనే నావేపు వొకసారిచ్చూసి చిన్న చిరునవ్వు పారేసింది! దాన్ని నేనందు కొని జాగ్రత్తగా హృదయసీమలో పదిల పరచుకొని-యిచ్చినది ఋణపడి వుండ కూడదు కనక–యిచ్చినదానికి బదులు యివ్వాలి కనక–నేనూ మ్యా ఆవిడ హృదయకుహరంలో బంధించుకోమని చిరునవ్వు విసిరేను. అబ్బ! మా అవిడ కింతసిగ్గుందని నే నీనాడు గ్రహించేను. నిజం! ఎలా సిగ్గుపడిందని! ఎంతెలా సిగ్గు భారంతో కనురెప్పలు వాల్చిందని! కవినిగాను నేను ఆమెను వర్ణించటా నికి! ఆ సమయంలో నేను కవినిగా లేక పోయినందుకు నిజంగా ఏడ్చేను! నన్ను కవిగా పుట్టించనందుకు భగవంతుణ్ణి తిట్టేను! అయినా ఏంలాభం! నేను కవి నిగా లేకపోయేను! అలా అలా సిగ్గుపడ్తూ నాదగ్గరకొచ్చి "అమ్మ పిలుస్తోందండి!" అంది. అహ! అహహ! ఎంతవినయం-ఎంత విధేయత! నన్ను మా ఆవిడ "అండి!" అందండి! ఎన్నాళ్లకి! నిజంగా మాఆవిడ నన్ను "అండి!" అంటుంటే నాకు ప్రపంచాన్ని యిచ్చినా కాలదన్నే వాడిని! మరొకసారివినాలని "ఏమిటి?" అన్నాను. తిరిగి నవ్వుతూ "అమ్మ రమ్మందండి!"అంది. ఇక భావ్యంకాదని అత్తగారివద్ద కెళ్లేను. అవిడ నాచేతుల్లో మాంచి నాలుగువేళ్ల వెడల్పు అంచు జరీపంచె, సిల్కు చొక్కా పెడ్తూ "కట్టుకురావోయ్! మామగార్కినమస్క రిద్దువుగాని" అన్నారు. నిజంగా ఆ బట్టలు నాకెంత చక్కగావున్నాయను కొన్నారు! అబ్బ! అప్పుడు మీరు నన్ను చూడాల్సిందే. ప్రతీరోజూ చూచే మా అవిడే నన్ను అదేపనిగా కన్నార్ప కుండా చూడటం మొదలెట్టింది. అలా చూస్తుంటే నాకే సిగ్గనిపించింది. సిగ్గుతో ముఖం దించుకొంటుంటే మా అవిడే తన మునివేళ్ళతో నా చుబుకాన్ని పట్టు కొని పైకెత్తి కళ్లల్లోకళ్లుపెట్టి చూస్తూ "అబ్బ! ఎంత అందంగావున్నారండి-ఊc! మరీ అంతసిగ్గయితే ఎలా!"అంది. ఏమి నా అదృష్టం! మా అవిడ నన్ను యింతయిదిగా పొగుడుతోంది! ఆశ్చ ర్యంతోపాటు మైమరపు వచ్చింది. ఆ మైమరపులో నేనేంచేస్తున్నదీ తెలీక మా శ్రీమతిని దగ్గరగా తీసుకొన్నాను. చెప్పొద్దూ మాఅవిడమాత్రం వైదొలగు తూ "అబ్బ! వదుల్దురూ! పాపావాళ్లూ చూస్తారూ!" అందో లేదో వచ్చిందండీ మా మఱదలు సూర్యాకాంతం! మా అవిడే ఏ దేవలోకపువాసో అనుకొంటే మా మఱదలు మరీనండి! నాచురంగు పరికిణీమీద తెల్లని ముత్తెంలాంటి సిల్కువోణి. నీలంబ్లౌజు, కలర్‌బై కెల్కి కలర్! అందులో సినీస్కోపు. "ఏంమఱ దలా! వొక్క ముద్దుయిస్తా!" అన్నాను. మఱదలు తల్లో తురుముకొన్న ఒకే వొక మందారం నన్ను వురిమిచూసింది. మఱదలు కోపంగా "ఛాల్లె! మీసాలు గుచ్చుకోవూ!" అంది. అప్పుడే నా జన్మలో నా చక్కటి మీసాల్ని తిట్టుకోట మండి! ఏంచేస్తాం సిరీరాకకు మోకా లడ్డం అంటారు యిటువంటిదాన్నే కామోసు.

"అక్కయ్యా! తొందరగారావే! పేరం టంకి పిలవ్వొద్దూ" అంటూ మాఅవిడని లాక్కుపోయింది. రాలుగాయి - పుడుకు మోతు పెంకి! కొంటెపిల్ల! కాకపోతే ఏమిటండి! యిన్నాళ్ళకి మా అవిడ నన్ను "అండి" అంటూ అప్యాయంగా మాట్లాడ్తూంటే సైందరులడ్డూలా! పేరంటం అంటూ తీసుకుపోయింది. మఱదళ్ళచేత ఏడిపించబడాలని మన తెలుగుదేశపు బావల లలాటాన్ని లిఖించి పారేసాడాబ్రహ్మ. అవునుమరి. రాసిపారెయ్యడూ! తనకీ ఓ మఱద లుంటే తెలిసొచ్చేది.

సాయంకాలం నాలుగుగంట లైందో లేదో మా అవిడ వస్తు–బహుసా పేరం

టానికి పిల్చి రావటం అనుకొంటా! వస్తూనే "ఏమండోయ్! మీరు అగదిలో కూర్చోండి. అంతేగాని అటూ యిటూ తిరగటంకాదు. పేరంటాళ్ళు వొస్తున్నారు" అంది. అనడం ఏమిటిఖర్మ. ఆజ్ఞాపించింది. హతోస్మి! హాయిగా బైటికిపొమ్మంటే పోయేవాణ్ణిగా! అబ్బో! అక్కడేవుందండీ – మా అవిడ రాజకీయపుటెత్తు. నేను పైకివెళ్తే దాని పేరంటానికి అవసరమైన వస్తువులు–అంటే అరటిపళ్ళు, చెక్కలు, తమలపాకులు ఎవరుతెస్తారు? రెండోది నేను పైకివెళ్లి ఎక్కడ పేకాట ఆడేస్తాననో అని భయం. ఆడతానే అనుకొండి! దానిడబ్బా! అలా అడుగుతే అంటుందికదా "నీ-నా అన్న భేదాలు భార్యాభర్తలమధ్య వుండకూడదయ్యా" అని. కాని అన్నివిషయాల్లోనూ కాదండోయ్! కేవలం డబ్బు విషయంలోనే. ఏంచేస్తాం! మారుమాట అన్లేక–ఎదురు చెప్పలేక గదిలో కూర్చున్నా. అయిదు అయింది. అరయింది. ఏడయింది. యిల్లంతా పేరంటాళ్ల పట్టుచీరల రపరపల్తో, మంచి గంధం వాసనల్తో నిండిపోయింది. మాటిమాటికీ పట్టుచీరల మెత్తని రెపరెపలు వినిపిస్తూనే వున్నాయి. పట్టురవికెల గరగరలు వింటూనే వున్నాను. కాని ఆ మోహనాంగులు కన్పించరే! కళ్ళకడ్డంగా గుమ్మానికి చిక్కటితెర! ఖర్మ అండి! అసలే నేను సౌందర్యోపాసకుణ్ణి, అయినా ఏంచేస్తా! భరించేనండి. చివరికి ఎనిమిదిగంటలు దగ్గరయింది. యింతలో మా మఱదలు గొంతు విన్పించింది. "రా ఏడుకొండలూ! యిప్పుడా రావటం, అయినా నీకు బుద్ధిలేదోయ్! నీకోసం కళ్లు కాయలుకాచినయ్.

ఏమిటి ఏడుకొండలు! చిక్కావురా ఏడుకొండలూ పొద్దున్నుండీ సస్పెన్సుతోనింపి నన్ను గారెలు తినకుండా చేసేవు. కాసుకో! ఏడుకొండలు దొరికేడు. యిక సస్పెన్సు భరించలేను. మా ముద్దుల మఱదలుకి ప్రేమలేఖ వ్రాసిన నీచుడు నన్ను గారెముక్కలు తిననీకుండాచేసిన దుర్మార్గుడు. వీడిని ఏంచేస్తే పాపం! వెంటనే కుర్చీనుండి లేచేను. సిల్కుచొక్కా చేతులు పైకెత్తేను. కర్టను తొలగించబోతున్నా. యింతలో "సారీ పాపా! అమ్మ యింట్లోకి రాదు. వంటచేసివస్తున్నా" వీణారవం లాంటి సన్నని, మెత్తని, మధురమైన ఆడగొంతు. ఆశ్చర్యపోయేను. ఏడుకొండలు ఆడదా! మగాడుకాదూ! కాని అనుమానం పోలేదు. ఆడగొంతును బోలిన మగమనుషులు-మగగొంతును బోలిన ఆడమనుషులు వున్నారండోయ్! ఏమో ఎవరికితెలుసు! ఏపాములో ఏ పుట్టవుందో - కాదు కాదు ఏపుట్టలో ఏ పాముందో! కర్టను తియ్యబోతున్నాను. పాపగొంతు విన్పించింది.

"రావోయ్–ఏడుకొండలూ! బావకి పరిచయంచేస్తానూ."


"అబ్బ! నేను రానుబాబూ! ఆయనేవనుకుంటారో" యిక సస్పెన్సు భరించలేక కర్టను తొలగించేనండి! ఎదురుగా పాప! అందమైన అమ్మాయి చేతులుపట్టుకొని నుంచొంది. "అదిగో బావే వచ్చేడు." అంటూ పాప ఆ అమ్మాయిని నా దగ్గరకు లాక్కొచ్చి "బావయ్యా! నాప్రియుడు ఏడుకొండలు కొండలూ! నిన్ను యిన్వెస్టిగేటు చెయ్యబోయిన డిటెక్టివ్ మా బావగారు సుందరం.

ఏంచేస్తానండి! సిగ్గుతో ముఖందించుకున్నాను. నాకంటె ముందే కందగడ్డ లాంటి తనముఖాన్ని వాల్చేసుకొంది ఏడుకొండలు. తర్వాత నెమ్మదిగా "బలేదానివే! నీనుండి గారెలు కూర తిన్లేదు" అన్నాను. "పోనీ యిప్పుడు తిందువుగాని బావా!" అంటూ వంటింట్లోకి పోయింది పాప. తర్వాత ఏడుకొండలు క్లుప్తంగా తనకథ చెప్పింది. పాపం! తల్లిదండ్రులకు వరసగా పిల్లలు పోతుండడంవల్ల ఈపిల్లకు ఆపేరు పెట్టుకొన్నారుట.

అమ్మయ్య! అదిగో కమ్మని గారెల వాసన వస్తోంది. అందమయిన మామఱదలు ప్లేటుపట్టుకొని వస్తోంది. మరివస్తా.

★


# రూ. 5 లకు కెమెరా



చెయిన్ సిస్టమ్ అనే పద్ధతిలో మీ రొక దిగుమతి చేయబడిన మడిచి వేయగల ఒక కెమెరాను పొందవచ్చును. 5 సంవత్సరముల గారంటీ కలది. ఖరీదు 5 రూపాయలు మాత్రమే. టపాఖర్చు రూ. 1-25 న. పై. లు ప్రత్యేకం.

గమనిక :—ఈ పద్ధతిని మా హనిమూన్ సెంటును ప్రబలము చేయుటకే తెలిపియున్నాము. తృప్తినీయనిచో డబ్బు వాపసు యీయగలము.

INDIAN CHAMBER OF SCIENCE (C. G. M.) Jullundur City.